క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: మండలంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పర్యటిస్తారని మండల కన్వీనర్ మణి అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 49కొత్తపల్లిమిట్ట దీపిక కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి యూత్ కమిటీ, బూత్ కమిటీ, నూతనంగా పార్టీ ఎన్నుకున్న వివిధ కార్యవర్గసభ్యులతో, పార్టీ శ్రేణులతో సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వారికి దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి గురువారం మండలంలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెదురుకుప్పంలో గురువారం 11 గంటలకు జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమలో పాల్గొని వలంటీర్లను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

కూలీల సంఖ్య పెంచాలి


సమీక్షలో ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. బుధవారం ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి ఈ ఏడాదికి 4 లక్షల 14వేల పనిరోజులు కేటాయించారని, ప్రతి కుటుంబానికి వంద పని దినాలు కేటాయించారని, ప్రతి కూలీ రోజువారి వేతనం గరిష్ఠంగా రూ.272లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అనంతరం వేణుగోపాలపురంలో ఉపాధి పనులను టెక్నికల్ అసిస్టెంట్ నౌషాద్ బాషా తనిఖీ చేశారు.

సద్వినియోగం చేసుకోండి


ఫిజియోథెరపీ చేస్తున్న అనూషా

పాలసముద్రం: మండలంలోని భవిత కేంద్రంలో ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం పాలసముద్రం భవితకేంద్రంలో ఫిజియోథెరపిస్ట్ అనూషా తొమ్మిది మంది దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. పిల్లల తల్లిదండ్రులతో డాక్టర్ అనూషా మాట్లాడుతూ శారీరకంగా లోపం ఉన్న పిల్లలకు భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగవైకల్యం కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సిపాయి విరాళం


నగదును అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెలో శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణం, వసతుల కల్పనకు బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఏళ్ల తరబడి శ్మశానానికి మృతదేహాలను తరలించాలంటే రోడ్డు సౌకర్యంలేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీకి గ్రామస్తులు సూచించారు. ఎమ్మెల్సీ స్పందించి గ్రామానికి వెళ్లి పంచాయతీకి రూ.2 లక్షలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, నాయకులు అంకిరెడ్డి, రామ్‌రెడ్డి, చెంచురెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, డి.మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో పరస్పర దాడి

- ఇద్దరికి గాయాలు

కేవీబీపురం: పొలానికి నీరు అందించే విషయంలో తలెత్తిన వివాదం ముదిరి కత్తులతో ఘర్షణకు దిగిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని పెరిందేశంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. పెరిందేశం దళితవాడకు చెందిన వెట్టి మాధవయ్య(60) తన పొలానికి నీరు రాకుండా అడ్డుకుంటున్నాడని అదే గ్రామానికి చెందిన బత్తెయ్య (56) పొలం వద్ద వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య గొడవ పెరగడంతో స్థానిక రైతులు సర్దిచెప్పారు. ఇంటికి చేరుకున్న అనంతరం బత్తెయ్య మళ్లీ కత్తితో వచ్చి మాధవయ్యను కడుపులో పొడిచాడు. ఇది గమనించిన మాధవయ్య కొడుకు బత్తెయ్యపై కత్తితో దాడి చేశారు. ఇద్దరినీ బంధువులు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్‌ఐ లోకనాథం తెలిపారు.

ఆర్బీకేలతో బహుళ ప్రయోజనాలు

- వెల్‌నెస్ సెంటర్లతో చేరువైన వైద్యసేవలు
- మంత్రి ఆర్కే రోజా


రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్కే రోజా

నగరి: రైతు భరోసా కేంద్రాలతో బహుళ ప్రయోజనాలు రైతులకు అందుతున్నాయని, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు చేరువయ్యాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని వీకేఆర్. పురంలో రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు రైతులు అందిస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో విత్తనం మొదలు వ్యవసాయోత్పత్తుల అమ్మకం వరకూ సూచనలు-సలహాలు ఇవ్వడంతో పాటు పంట రుణాలు, ఇన్సూరెన్స్, వ్యవసాయ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి పంటలకు గిట్టుబాటు ధర పొందుతున్నారన్నారు. వెల్‌నెస్ సెంటర్ల వల్ల గ్రామీణ ప్రజలకు వైద్యం చేరువైందని, చిన్న పాటి ఆరోగ్య సమస్యలకు పట్టణాల్లోని ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. సచివాలయాలతో పాలనే వారికి చేరువైందన్నారు. ఇదే గాంధీజీ కలలు కన్న స్వరాజ్యమన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను ప్రజలకు చేకూర్చాలన్న ధ్యేయంతో సీఎం పనిచేస్తున్నారన్నారు. ఆయనకు ప్రతి ఒక్కరూ వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిని, ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుదర్శనం నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, నాయకులు దేవరాజులు, రవి, భాస్కర్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవనానికి భూమిపూజ


మంత్రి ఆర్కే రోజాను సన్మానిస్తున్న ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు

నగరి : నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్‌కు స్వంత భవన నిర్మాణానికి మంత్రి ఆర్కేరోజా బుధవారం భూమిపూజ చేశారు. ఓంశక్తి ఆలయ బైపాస్ కూడలి సమీపం ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవనం నిర్మించనున్నారు. ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యుల ఎన్నో ఏళ్ల మంత్రి ఆర్కే రోజా సాకారం చేశారు. మంత్రిని వారు గజమాలతో సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌సి ఆనంద్‌కుమార్, ఇంద్రయ్య మాట్లాడారు. నిత్యం పనుల కోసం నిత్యం నగరిలో అక్కడక్కడా ఎలక్ట్రీషియన్లు తిరుగుతూనే ఉంటారన్నారు. ఒక నిర్దిష్టమైన స్థలం ఉంటే అందరూ అక్కడే వేచివుంటారని. ఎవరికి ఎలక్ట్రీషియన్ల అవసరమున్నా ఆ ప్రాంతంలో సంప్రదించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించారని కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సహకారంతో భవన నిర్మాణం ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం


ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

పాలసముద్రం: ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. ఆముదాల గ్రామంలో బుధవారం డ్వాక్రా సంఘ మహిళలతో కలిసి ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీసీ చిరంజీవి, డ్వాక్రా సంఘ మహిళలు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ఒత్తిడిని అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని హెచ్‌ఎం చక్రధరరావ్ తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చిత్తూరు జన విజ్ఞాన వేదిక, ఎస్టీయూ మండల శాఖ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ఉన్నత కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవాల్సిన విధానం, పరీక్షల ఒత్తిడిని ఎలా అధిగమించాలో వివరించారు. ఎస్టీయూ నేతలు ఏలుమలై, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవాతత్పరులు వలంటీర్లు


అవార్డులు అందుకున్న వలంటీర్లతో చైర్మన్ హరి

పుత్తూరు: వలంటీర్లు సేవాతత్పరులని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి కొనియాడారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో పుత్తూరు మున్సిపాలిటీలోని వలంటీర్లను వివిధ అవార్డులు, రివార్డులతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్నారని, వారి పనితీరుతో ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందన్నారు. పుత్తూరు నుంచి సేవావజ్ర అవార్డుకు ఒకరు ఎంపిక కాగా, సేవారత్నకు ఐదుగురు, సేవామిత్ర కింద 227 మంది ఎంపికయ్యారని ఆయన వివరించారు. అందరినీ ఘనంగా సత్కరించి, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, చిట్టిబాబు, నరసింహా, రాధ, జయలక్ష్మి, భానుమతి, కుప్పమ్మ, షకీలా, నాయకులు కార్తికేయన్, జయబాబు, గాంధి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పథకాలు అందించాలి


మాట్లాడుతున్న సర్పంచ్

పాలసముద్రం: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్లు లబ్ధిదారులకు సకాలంలో అందించాలని సర్పంచ్ జి.మహేష్‌బాబు తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్ సమీక్షంలో సమావేశం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ శ్రీకావేరిరాజుపురం సచివాలయ పరిధిలో నేడు గురువారం వలంటీర్లకు సేవా పురస్కారాలు కార్యక్రమం జరగనుందని తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి విచ్చేయున్నారని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సంఘమిత్రలు శోభ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు లోకేష్, లక్ష్మణన్ పాల్గొన్నారు.

మాతృభాష తల్లితో సమానం



పుత్తూరు: తెలుగులో ఉపన్యసిస్తున్న విద్యార్థిని, పుత్తూరు: మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి

పుత్తూరు: మాతృభాషను తల్లితో సమానంగా గౌరవించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పుట్టిన ప్రతి బిడ్డ ఎలాంటి శిక్షణ లేకుండా అప్రయత్నంగా తల్లి నుంచి నేర్చుకొనే భాష మాతృభాష అని చెప్పారు. మాతృ భాష నశిస్తే ఆ భాష మాట్లాడే జాతి మొత్తం నశిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు అచ్చ తెలుగు భాషలో ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య, తెలుగు శాఖాధ్యక్షులు పి.వెంకటేశన్, డిగ్రీ అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహులు, అధ్యాపకులు నాగేశ్వరరావు, రఘురామన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి మాతృభాషా దినోత్సవం గురించి మాట్లాడారు. విద్యార్థులు చదువు, సంస్కారాన్ని కలిగి ఉండాలన్నారు. ఎస్‌ఆర్‌ఎస్ కళాశాలకు ఎంతో మంది డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులను అందించిన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో నరసింహులు, సునీత, ఏకాంబరాచారి, అపరంజి, బాబు, అమ్ముదేవి, నిరంజన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.


నగరి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నగరిలో..

నగరి: జీవితంలో రాణించడానికి మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం కళాశాలలో తెలుగు విభాగం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఆంగ్లం, ఇతర భాషలు నేర్చుకోవాలన్నారు. కానీ మన మాతృభాష తెలుగులోని తియ్యదనం, గొప్పదనాన్ని ఎప్పటికీ మరచిపోరాదన్నారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ, తెలుగుభాష అమ్మభాషని, అమ్మపాలలోని కమ్మతనం, తియ్యదనం తెలుగులో ఉంటుందని అందుకే శ్రీకృష్ణదేవరాయులు దేశభాషలందు తెలుగు లెస్స అని కొనియాడారని అన్నారు. ఆంగ్లభాషా వ్యామోహంలో పడి ప్రాంతీయ మాతృభాషలు అంతరించిపోకూడదనే ఉద్దేశంతో యునెస్కో ప్రతిపాదనలు అనుసరించి 2000వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కుంభాభిషేకం


కుంభాభిషేక వేడుకల్లో మంత్రి ఆర్కే రోజా

- పాంచాలమ్మ, పాండవులను దర్శించుకున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : స్థానిక సత్రవాడలోని పాంచాలీ సమేత పాండవ ఆలయంలో కుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో హోమ, కలశ పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం కుంభాభిషేక సంబంధిత ప్రధాన కలశాన్ని మంగళవాయిద్యాల నడుమ వేద పండితులు ప్రదక్షిణగా తీసుకువచ్చారు. విగ్రహ ప్రతిష్ఠ చేసిన అనంతరం గర్భాలయ విమాన శిఖర కలశ స్థాపన చేశారు. శిఖర కలశానికి వేదపండితులు అభిషేకం చేయగా ఈ జలం కోసం భక్తులు ఆలయం చుట్టూ బారులు తీరారు.

ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం

కుంభాభిషేక వేడుకలకు హాజరైన మంత్రి ఆర్కే రోజాకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె పాంచాలమ్మను, పాండవులను దర్శించుకుని అర్చనలు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా నేత విభాగం అధ్యక్షులు ఈవీ కన్నాయిరం, ఎంపీపీ భార్గవి, నాయకులు ఈకే అయ్యప్పన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రదోష కాల పూజలు


ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశుడిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, కుంకుమతో అభిషేకం చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రాస్ సేవలు అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: రాస్ సేవలు అభినందనీయమని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ఆవరణలో మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం తిరుపతి టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంపీపీ లత మాట్లాడుతూ ప్రాణాంతకమైన వ్యాధులకు ఖరీదైన వైద్య సేవలు అందిస్తున్న రాస్ స్వచ్ఛంద సంస్థకు ప్రతి మహిళ రుణపడి ఉండాలన్నారు. అలాగే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వృత్తి శిక్షణ కల్పించడం, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తున్న మహిళలకు బాసటగా నిలుస్తున్న రాస్ సేవలు ఎనలేనివని కొనియాడారు. టాటా ట్రస్టు వైద్యనిపుణులు డాక్టర్ వెంకయ్యబాబు, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి, రాస్ ప్రాజెక్టు అధికారి రవి, రాస్ సిబ్బంది ప్రకాష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి


జాగ్రత్తలు చెబుతున్న ఏడీ మురళీమోహన్

గంగాధర్‌నెల్లూరు: బర్డ్‌ఫ్లూపై ప్రజలు, కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని గంగాధర్‌నెల్లూరు ప్రాంతీయ పశువైద్యాధికారి మురళీమోహన్ అన్నారు. నెల్లూరు జిల్లాలో ఇటీవల కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్టు నిర్ధారణ అయిందని, పెంపకందారులు జాగ్రత్త వహించి బర్డ్‌ఫ్లూ వ్యాప్తిని అరికట్టాలన్నారు. ప్రజలు చికెన్‌ను, గుడ్లను బాగా ఉడకబెట్టి తింటే ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. ప్రతికోళ్ల ఫారం ముందు ఫుట్ బాత్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కలిజవేడు, నాసంపల్లి లోగల కోళ్ల ఫారంలలో తనిఖీ చేసి, ఫారం యజమానులకు తగిన సలహాలు, సూచనలు తెలియజేశారు. పశువైద్యాధికారి నాగాంజనేయులు, ఫారం యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతా-శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యం


రికార్డులను పరిశీలిస్తున్న డీపీహెచ్‌ఓ శ్రీనివాస్

పుత్తూరు: మాతా-శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యమని తిరుపతి జిల్లా ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ డీపీహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వడమాలపేట మండలం అప్పలాయగుంట వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రక్తహీనత కారణంగా చోటుచేసుకుంటున్న మరణాలను తగ్గించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తెలిపారు. అనంతరం రక్త నమూనాల సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీపీహెచ్ ఎన్‌ఓ బేబిరాణి, డీపీఓ ప్రకాష్, సర్పంచ్ శేషాద్రి రెడ్డి, సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఈటీలకు స్కాట్ బాధ్యత



మాట్లాడుతున్న ఈశ్వర్ రెడ్డి, హాజరైన పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు

పిచ్చాటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులకు స్కాట్ బాధ్యతలను అప్పగించినట్లు ఎంఈఓ యుగంధర్ రాజు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యవేడు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల పీఈటీలకు స్కాట్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు మంచి క్రమశిక్షణ పీఈటీలకు సాధ్యమన్నారు. పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ పీఈటీ అమ్ములు జిల్లా ఉమెన్స్ స్కాట్ అధికారిగా నియమితులయ్యారని తెలిపారు. హెచ్‌ఎం గిరి ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి సీఆర్‌సీ సమావేశాల్లో స్కాట్‌ను కూడా భాగం చేయాలన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆట స్థలం ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. వెంగళత్తూరు హెచ్‌ఎం ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాయామం ద్వారా ఆరోగ్యంగా, దేహదారుఢ్యం పెరిగేలా పీఈటీలు చూడాలని తెలిపారు. అనంతరం పీఈటీగా పనిచేస్తూ పిచ్చాటూరు, వెంగళత్తూరు జెడ్పీ హైస్కూళ్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు పొందిన గిరిప్రకాష్, ఈశ్వర్ రెడ్డిని సత్కరించారు. ఎంఈఓ యుగంధర్ రాజు తెలిపారు. పీఈటీల అసోసియేషన్ కార్యదర్శి బాబు, కుమార్, హేమకుమార్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో పాడిఆవు మృతి

సత్యవేడు: మండలంలోని ఆంబాకం గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌కుగురై పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన శంకరమ్మ జెర్సీ ఆవును పచ్చిగడ్డి మేత కోసం పొలాల వద్దకు తోలు కెళ్లింది. ఆవు పొలంలో గడ్డి మేస్తున్న సమయంలో విద్యుత్‌స్తంభాన్ని తగలగానే షాక్‌కు గురై విద్యుత్ స్తంభం సమీపంలోనే మృతి చెందింది. ఎర్త్ వైర్‌నుంచి విద్యుత్ సరఫరా అయ్యి షాక్‌కు గురైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆవు విలువ రూ.60వేలు చేస్తున్నందని బాధితురాలు తెలిపింది. సర్పంచ్ సంగీత ఇన్సూరెన్సు క్లైమ్ చేయించి రైతుకు న్యాయం చేస్తామన్నారు. ఆవు మృతి పశువైద్యులకు సమాచారం చేరవేశారు.